వృత్తిదారులకు తోడు.. జగనన్న చేదోడు

నాలుగు విడతల్లో రూ.12.45 కోట్లు అందజేత



గాజువాక: నవరత్నాల పేరిట సంక్షేమ పథకాలకు పెద్దపీట వేసిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచింది. జగనన్న చేదోడు పథకంలో భాగంగా రజకులు, నాయీ బ్రాహ్మణులు, దర్జీలకు ఏటా రూ.10 వేల చొప్పున సాయం అందించింది. కుల వృత్తులు మొదలుకుని దర్జీల వరకు బతుకుదెరువు కోసం కష్టపడేవారందరికీ భరోసానిచ్చింది. అందులో భాగంగా గత ఐదేళ్లలో ఇప్పటివరకు నాలుగు సార్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదును జమ చేసింది. ఒక్క గాజువాక నియోజకవర్గంలోనే సుమారు రూ.12.45 కోట్లను లబ్ధిదారులకు అందజేసింది.

జగనన్న చేదోడు లబ్ధిదారులు

సంవత్సరం	లబ్ధిదారులు	నగదు పంపిణీ
2019-20	1527	2,34,94,000
2020-21	5202	5,04,44,636
2021-22	2604	2,61,54,515
2022-23	2689	2,44,67,000

ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ద్వారా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలు చేశారు. ఈ పథకంలో టైలర్లు (అన్ని సామాజికవర్గాలు), రజకులు (వాషర్‌మెన్), నాయీ బ్రాహ్మణుల (బార్బర్ల)కు ఏటా రూ.10వేల చొప్పున అందిస్తున్నారు. కుల వృత్తిదారులు తమ ఆదాయ వనరును పెంచుకోవడానికి సాధనాలు, పరికరాలు ఇతర అవసరమైన వస్తువులను కొనుగోలు చేసుకోవడానికి ఉపయోగించుకోవడం కోసం ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది.

నాలుగు విడతల్లో లబ్ధిదారులకు అందజేసిన నగదు
12,45,60,151

మధ్యవర్తులు లేకుండా సచివాలయాల ద్వారా లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేసి, నగదు వారి ఖాతాల్లోనే నేరుగా జమ చేస్తున్నారు. ఈ పథకం అందిన తరువాత ఎంతోమంది వృత్తిదారులు తమ వ్యాపారాన్ని పెంచుకొని ఆర్థికంగా బలపడుతున్నారు.

సర్కారు సాయంతో సంతోషంగా బతుకుతున్నాం



నేను క్షౌర వృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. 2019కి ముందు చాలీచాలని ఆదాయంతో కుటుంబాన్ని పోషించడానికి, పిల్లలను చదివించుకోవడానికి చాలా ఇబ్బంది పడాల్సి వచ్చేది. 2019లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక, ఆయన అమలు చేసిన జగనన్న చేదోడు పథకం మా కుటుంబంలో వెలుగులు నింపింది. సెలూన్ షాపులో పరికరాలు, ఇతర అవసరమైన వస్తువులను కొనుగోలు చేయడానికి ఈ పథకం ఎంతగానో ఉపయోగపడింది. ఏడాదికి 10 వేల రూపాయల చొప్పున 4 ఏళ్లలో 40 వేల రూపాయలు అందించారు. నాడు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడ్డ నేను సర్కారు అందించిన సాయంతో సంతోషంగా బతుకుతున్నాను.

– మడసూరి అప్పలరాజు, సెలూన్ నిర్వాహకుడు, దువ్వాడ సెక్టార్-2

చేదోడు పథకం ఎంతో ఆదుకుంది



నేను చిన్న టైలరింగ్ షాపుతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన చేదోడు పథకం నన్ను ఎంతగానో ఆదుకుంది. ఆ సాయంవల్ల నేను నా వ్యాపారాన్ని కొంచెం అభివృద్ధి చేసుకున్నాను. దీనివల్ల ఆదాయం పెరిగింది. దీంతో నా ఇద్దరు కుమార్తెలకు వివాహాలు చేశాను. ఇప్పుడు నేను, నా భార్య టైలరింగ్ చేసుకుంటూ హాయిగా జీవనాన్ని సాగిస్తున్నాం. ఇప్పటికి మూడు విడతలుగా రూ.30 వేలు అందుకున్నాను. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి ధన్యవాదాలు. తిరిగి ఆయన్నే ముఖ్యమంత్రిగా చేసుకుంటాం.

– సనపల సత్యనారాయణ, టైలర్, అక్కిరెడ్డిపాలెం

మమ్మల్ని గుర్తించింది జగనన్నే..



నాకు జగనన్న చేదోడు ద్వారా 3 పర్యాయలు 30 వేల రూపాయలు లబ్ధి అందింది. గతంలో ఏ ప్రభుత్వం కూడా చాకలి పని చేసుకునే వాళ్లకి ధన సహాయం చేయడం మేము చూడలేదు. మొట్టమొదటి సారి ముఖ్యమంత్రి జగన్ మా కులాన్ని గుర్తించి, మాకు సాయం చేశారు. మాకు ఇస్త్రీ పెట్టె కొనుక్కోవాలంటే రూ.10 నుంచి 12 వేలు అవుతుంది. ఆ పెట్టె కొనుక్కుంటే గానీ, సంవత్సరం అంతా పని చేసుకోవడానికి సామగ్రి ఉండదు. ఇప్పుడు జగనన్న చేదోడు ద్వారా వచ్చే రూ.10వేలతో ఇస్త్రీ పెట్టె కొనుక్కుంటున్నాం. మాకు చాలా కలిసివస్తోంది. మాలాంటి పేదవాళ్లు ఆనందంగా బతకాలంటే మళ్లీ జగన్ గారే ముఖ్యమంత్రిగా రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం.

– తోకాడ ముత్యాలు, అగనంపూడి

'కేవీ మూసివేత ప్రతిపాదన విరమించుకోవాలి'



ధర్నాలో ప్రసంగిస్తున్న సీఐటీయూ నాయకులు

ఉక్కునగరం: ఉక్కు కేంద్రీయ విద్యాలయం మూసివేత ప్రతిపాదనను తక్షణం విరమించుకోవాలని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు డిమాండ్ చేశారు. స్టీల్ సీఐటీయూ, మిత్రపక్షాల ఆధ్వర్యంలో మంగళవారం కేవీ ఎదుట ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్రలోని బీజేపీ ప్రభుత్వం బయట ప్రచారంలో ఒకరకంగా, ఆచరణలో వేరే రకంగా వ్యవహరిస్తోందన్నారు. నిర్వాసితులు, ఉక్కు ఉద్యోగుల పిల్లలకు విద్యను అందించాల్సిన బాధ్యత ఉక్కు యాజమాన్యంపై ఉందన్నారు. ఆ బాధ్యత నుంచి తప్పుకోవడం అత్యంత దుర్మార్గమన్నారు.

సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ కేవీలో ప్రస్తుతం 1050 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్నారు. కేవీ భవిష్యత్తు దృష్ట్యా ఆర్థిక సహకారం కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ 1వ తరగతి, 11వ తరగతి ప్రవేశాలు నిలిపి వేయడం, సెక్షన్‌కు 40 మించరాదని నిర్ణయించడం అన్యాయమన్నారు. వెంటనే ఆ నిర్ణయాలను వెనక్కు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వై.టి.దాస్, డి.వి.రమణారెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



శిబిరంలో కంటి వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో ఆదిత్య డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్)లో భాగంగా పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా గ్రామంలోని తారక రామా కల్యాణ మండపంలో మంగళవారం ఉచిత కంటి, దంత, జనరల్ ఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. 500 మందికి ఈ శిబిరంలో వైద్యసేవలు అందించి, ఉచితంగా మందులు అందించినట్లు కళాశాల ఎన్ఎస్ఎస్ పీవో తిరుపతి రావు తెలిపారు. ఈ నెల 16న మొదలైన స్పెషల్ క్యాంప్ ఈ నెల 22వ తేదీ వరకు జరుగుతుందని, పలు సేవా కార్యక్రమాలను చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.ప్రదీప్ కుమార్, ఎం.సత్యప్రకాష్, కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి పాల్గొన్నారు.

బీఎస్సీ పారా మెడికల్ కోర్సుల్లో ఉచిత అడ్మిషన్లు

అక్కిరెడ్డిపాలెం: బొల్లినేని మెడ్ స్కిల్స్‌లో బీఎస్సీ పారా మెడికల్ కోర్సుల్లో ఉచితంగా అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ ట్రాన్సిషన్ టెక్నాలజీ, రేడియో థెరపీ టెక్నాలజీ, ఫిజిషియన్ అసిస్టెంట్ టెక్నాలజీ, కార్డియాక్ కేర్, ఫెర్ఫ్యూషన్, రేడియాలజీ, ఆప్టో మెట్రీ, న్యూరో ఫిజియాలజీ, డయాలసిస్, రెసిపేటరీ, మెడికల్ రికార్డ్స్ టెక్నాలజీ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కోర్సుల్లో చేరేందుకు ఇంటర్ బైపీసీ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు 79950 13421, 72079 53919 సెల్ నంబర్లకు లేదా షీలానగర్ కిమ్స్ ఆస్పత్రిలోని తమ సంస్థ బొల్లినేని మెడ్ స్కిల్స్‌లో సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి స్టీల్‌ప్లాంట్‌లో ఎల్ఐసీ సర్వీస్ క్యాంప్

ఉక్కునగరం: జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) గాజువాక బ్రాంచ్ ఆధ్వర్యంలో బుధ, గురువారాల్లో స్టీల్‌ప్లాంట్‌లో పాలసీ సర్వీస్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. పే సెక్షన్ హాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్న క్యాంప్‌లో మెచ్యూరిటీ, మనీ బ్యాక్ పాలసీ, క్లెయిమ్‌లు పరిష్కరించనున్నారు. పాలసీదారులు తమ పాలసీ మెచ్యూరిటీ కోసం బ్యాంక్ అకౌంట్ ప్రూఫ్‌తో నెఫ్ట్ ఫారం, ఆధార్, పాన్ కార్డుల జిరాక్స్ కాపీలు, ఒరిజినల్ పాలసీ బాండ్, డిశ్చార్జి డ్యూటీ ఫారం, రెవెన్యూ స్టాంప్‌లతో హాజరు కావాలని బ్రాంచ్ సీనియర్ మేనేజర్ కోరారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

పెదగంట్యాడ: ఉజ్వల పథకం ద్వారా వంట గ్యాస్ లేని నిరుపేదలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు అందజేస్తున్నామని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. జీవీఎంసీ 64వ వార్డు గంగవరం గ్రామానికి చెందిన 50 మంది మహిళలకు మంజూరైన గ్యాస్ కనెక్షన్లను మంగళవారం ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో గరికిన పైడిరాజు, గరికిన మాధవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీనివాస కల్యాణం



స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు దయాల్‌నగర్ కొండపై కొలువై ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ నెల 19 ప్రారంభమైన ఉత్సవాలు ఈ నెల 24 వరకు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఆలయ ధర్మకర్త తిప్పల రమణారెడ్డి, అన్నపూర్ణ దంపతుల ఆధ్వర్యంలో స్వామి కల్యాణాన్ని మంగళవారం కనులపండువగా నిర్వహించారు.

లోకేష్ వ్యాఖ్యలు అర్థ రహితం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ గాజువాకలో నిర్వహించిన ఎన్నికల శంఖారావం సభలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో మంగళవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత అవినీతికి పాల్పడ్డానని లోకేష్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మంత్రులు, ఎమ్మెల్యేలను లక్ష్యంగా చేసుకుని లోకేష్ లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. టీడీపీ నేతలకు దమ్ముంటే తాను చేసిన అవినీతిని నిరూపించాలన్నారు. గాజువాక హౌస్ కమిటీ పట్టాలు, అగనంపూడిలోని టోల్‌గేటు విషయంలో మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చేసిన ఆరోపణలు అవాస్తవమన్నారు. వాస్తవాలను పక్కన పెట్టి తనపై అవాకులు చవాకులు పేలితే సహించేది లేదని హెచ్చరించారు. ఇప్పటికైనా టీడీపీ నాయకులు పంథా మార్చుకోవాలని, లేకపోతే రానున్న ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఇలాగే మాట్లాడితే తెలంగాణ మాదిరిగానే ఇక్కడ కూడా తెలుగుదేశం పార్టీ భూస్థాపితం కావడం ఖాయమన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి చందు, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, రాజాన రామారావు, బొడ్డు నర్సింహపాత్రుడు, భూపతిరాజు సుజాత, మహ్మద్ ఇమ్రాన్, నాయకులు పల్లా చినతల్లి, ధర్మాల శ్రీను, బొడ్డ గోవింద్, గొందేశి వెంకటరమణారెడ్డి, మంత్రి శంకరనారాయణ, చిత్రాడ వెంకటరమణ, మద్దాల అప్పారావు, నాగిశెట్టి శ్రీను, లోకనాథం, పరంకుశం ప్రమీల, మస్తానప్ప, ఎన్నేటి రమణ, మహ్మద్ గౌస్, రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

ఈ ప్రాంతంపై అవగాహన లేని వ్యక్తి లోకేష్

వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చందు

గాజువాక : గాజువాక ప్రాంతంపై, ఇక్కడి సమస్యలపై ఏమాత్రం అవగాహన లేని వ్యక్తి లోకేష్ అని వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు అన్నారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గాజువాక శంఖారావం సభలో లోకేష్ ఇష్టానుసారంగా మాట్లాడటాన్ని ఖండిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే నాగిరెడ్డిపై లోకేష్ ఇష్టానుసారంగా మాట్లాడారని, ఆయన హయాంలోనే గాజువాక ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చెందిందని అన్నారు. నాగిరెడ్డి అవినీతిపరుడని అనడం లోకేష్ అవివేకానికి నిదర్శనమన్నారు. గాజువాకలో ఏళ్ల నాటి భూసమస్యను పరిష్కరించింది నాగిరెడ్డి అని అన్నారు. బీసీలకు సముచిత స్థానం కల్పించాలనే ఉద్దేశంతోనే తనను సమన్వయకర్తగా జగన్ మోహన్ రెడ్డి నియమించారన్నారు.

చంద్రబాబు ఎప్పుడైనా పట్టించుకున్నారా?

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ ఏమీ చేయలేదంటూ లోకేష్ మాట్లాటం హాస్యాస్పదమన్నారు. ప్లాంట్ ప్రైవేటీకరణకు కేంద్ర ప్రభుత్వ ప్రకటన వెలువడిన వెంటనే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి స్పందించి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర శాసనసభలో తీర్మానం చేశారని, ఆ విషయంపై ప్రధానమంత్రికి రెండు లేఖలను రాశారని అన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఏనాడైనా ఈ ప్లాంట్ కోసం పట్టించుకున్నారా అని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులపై లాఠీ చార్జీ చేయించిన ఘనత ఆయనదన్నారు. ఆయన హయాంలోనే జింక్ కర్మాగారాన్ని మూసివేయించారన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి స్టీల్‌ప్లాంట్‌ను లాభాల్లోకి తేవడానికి కృషి చేశారన్నారు. నష్టాల్లో ఉన్న బీహెచ్‌పీవీని భెల్‌లో విలీనం చేయించి, దాని మనుగడకు కృషి చేశారన్నారు. షిప్‌యార్డును డిఫెన్స్‌లో విలీనం చేయించారన్నారు. చంద్రబాబు, లోకేష్‌లకు ఎప్పుడూ రాష్ట్ర ప్రజలను మోసం చేయడం తప్ప ఈ విషయాలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఇప్పటికైనా నిజాలను తెలుసుకుని మాట్లాడాలని, లేనిపక్షంలో ప్రజలు బుద్ధి చెబుతారని అన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు రాజాన రామారావు, బొడ్డు నర్సింహపాత్రుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు గుడివాడ లతీష్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ కుంగ్‌ఫూ పోటీల విజేతకు సత్కారం



పత్తి రమణను సత్కరిస్తున్న డాక్టర్ రాజారావు

పెదగంట్యాడ: హైదరాబాద్ లో ఈ నెల 11 నుంచి 19 వరకు న్యూ డ్రాగన్ ఫైటర్స్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మూడో అంతర్జాతీయ మార్షల్ కుంగ్‌ఫూ పోటీల్లో బంగారు పతకం, కాటాలో సిల్వర్ మెడల్ సాధించిన పత్తి రమణను సత్య హెల్త్ కేర్ జిమ్ అధినేత డాక్టర్ ఎస్.రాజారావు ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ రమణ స్టీల్‌ప్లాంట్‌లో పని చేసి ఉద్యోగ విరమణ పొందినా, మార్షల్ ఆర్ట్స్‌లో చురుగ్గా పాల్గొనడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కె.రాజు, జి.సత్యారావు, కె.తేజ, సంతోష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీఎల్ఏల పాత్ర అత్యంత కీలకం



ఓటరు జాబితాలపై సూచనలు చేస్తున్న చందు

గాజువాక : రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బూత్ లెవెల్ ఏజెంట్ల పాత్ర అత్యంత కీలకమని ఆ పార్టీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు అన్నారు. 72వ వార్డు బీఎల్ఏలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటరు జాబితాల్లోని ఓటర్ల పేర్లను సరిగ్గా పరిశీలించాలన్నారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులకు సంబంధించిన ఓట్లన్నీ ఉండేవిధంగా చూసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రతీ కుటుంబానికి మేలు జరిగిందని, ఈ విషయాన్ని ప్రజలకు వివరించాలని కోరారు. సమావేశంలో నాయకులు సిరట్ల శ్రీనివాస్, రెడ్డి జగన్నాథం, ధనలక్ష్మి, ఆదిలక్ష్మి, హేమలత, మధు, దుర్గ, ప్రసాద్, భవానీ, నాయుడు, నాగమణి, వరలక్ష్మి, జగన్నాథం, జానకి, రమణి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన



హెల్మెట్లు అందుకున్న విద్యార్థులతో సంస్థల ప్రతినిధులు, ఉపాధ్యాయులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు రోడ్డు భద్రతపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్రియేటివ్ స్వచ్ఛంద సంస్థ, ఇండియన్ హెడ్ ఇంజరీస్ ఫౌండేషన్, హీరో మోటార్స్ కంపెనీ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ రూల్స్ పాటించడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 1 నుంచి 3వ తరగతి విద్యార్థులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థల ప్రతినిధులు మళ్ల నాగేశ్వరరావు, రోహిత్, పాఠశాల హెచ్ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం, ఉపాధ్యాయులు బి.రవిచంద్, పీడీ ఇస్మాయిల్, నాగేశ్వరరావు, రాము తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో ప్రథమ చికిత్సపై పోటీలు



పోటీల ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న భద్రతా అధికారి మల్లయ్య

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కోక్‌ఓవెన్స్ జోన్‌లో మంగళవారం ఫస్ట్ ఎయిడ్, ఎమర్జన్సీ రెస్పాన్స్‌పై పోటీలు నిర్వహించారు. 53వ జాతీయ భద్రతా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ పోటీల్లో ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు. మొత్తం ఎనిమిది జట్లు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నాయి. అంతకు ముందు విభాగాధిపతి ఎం.వి.ఎస్. దుర్గాప్రసాద్ పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఏదైనా ప్రమాదం జరిగినపుడు ఫస్ట్ ఎయిడ్, ఎమర్జన్సీ రెస్పాన్స్‌పై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. న్యాయనిపుణుల కమిటీ సభ్యులు డాక్టర్ మాధవి, ఎం.ఎ స్.ఎస్. రాజు, వరప్రసాద్, జోనల్ సేఫ్టీ ఆఫీసర్ బయ్యే మల్లయ్య, వర్మ, అభిజిత్ తదితరులు పాల్గొన్నారు.

1104వ రోజుకు 'ఉక్కు' దీక్షలు



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును అమ్మాలనే దుర్మార్గపు ఆలోచనను విరమించుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు.

ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 1104వ రోజు మంగళవారం పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ప్రజల సంపదైన విశాఖ ఉక్కును కాపాడుకోవడం కోసం దేశ వ్యాప్త ఉద్యమాలకు సిద్ధమన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

విశాఖ విద్య: విద్యార్థులు చదువులతో పాటు ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించేలా తోడ్పాటు అందిస్తామని సాంఘిక సంక్షేమ గురుకులాల ఉమ్మడి విశాఖ జిల్లా కన్వీనర్ ఎస్. రూపవతి అన్నారు. క్రియేటివ్ ఫైన్ ఆర్ట్ అకాడమీ, రాష్ట్ర క్రియేటివిటీ కల్చర్ ఆధ్వర్యంలో గుంటూరు వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీల్లో పాల్గొని గోల్డ్‌మెడల్స్ సాధించిన శ్రీకృష్ణాపురం గురుకుల విద్యార్థులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. గురుకుల పాఠశాల, కళాశాలకు చెందిన 50 మంది విద్యార్థులు నాలుగు గోల్డ్ మెడల్స్, మూడు సిల్వర్ మెడల్స్‌తో పాటు వివిధ కేటగిరీల్లో బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

శాస్త్రోక్తంగా శత సువాసినీ పూజలు



అనుగ్రహ భాషణం చేస్తున్న మాతా రమ్యానంద భారతి



అష్టోత్తర శత సువాసినీ పూజలు చేస్తున్న మహిళలు

సీతంపేట: అమృతోత్సవం పేరిట శ్రీలలితాపీఠం 75వ వార్షికోత్సవాలు విశేష పూజా కార్యక్రమాలతో వైభవంగా జరుగుతున్నాయి. కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి సమక్షంలో రెండో రోజు యాగశాలలో మండపారాధనలు, కలశస్థాపన, అగ్ని ప్రతిష్ఠ, రక్షోఘ్న గణపతి హోమం, మణిద్వీప దేవతా విశేష పూజలు నిర్వహించారు. కుర్తాళం పీఠ పురోహితులు మాచవోలు రమేష్ శర్మ పర్యవేక్షణలో వేద పండితులు విశేష పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిపించారు. సాయంత్రం పీఠం దర్బారుహాల్లో సామూహిక లలితాసహస్రనామ పారాయణ, అష్టోత్తర శత సువాసినీ పూజలు జరిగాయి. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతి స్వామిని అనుగ్రహ భాషణం చేశారు. బుధవారం సాయంత్రం 6.30 గంటలకు శ్రీభూనీలా సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరుగుతుందని, భక్తులు పాల్గొని తరించాలని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ కోరారు.

చురుగ్గా కల్యాణ మండప నిర్మాణ పనులు



కల్యాణ మండపం శ్లాబ్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వంశీరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు పరిధి దయాల్‌నగర్ క్వారీ రోడ్డులోని స్వర్ణ నూకాంబిక అమ్మవారి ఆలయంలో కొత్తగా నిర్మిస్తున్న కల్యాణ మండపం పనులు జోరుగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం శ్లాబ్ పనులను వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నిర్మాణంలో నాణ్యత పాటించాలని సూచించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి, కల్యాణ మండపాన్ని వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో అనపర్తి త్రినాథ్, శీకు రమణ, గోవింద, కోరాడ రామకృష్ణ, సీతారాం, జగన్ తదితరులు పాల్గొన్నారు.